దానివల్ల కలిగే చక్కటి అనుభూతి గురించి తెలీదా అంటే తెలుసు. ప్రార్థన వల్ల దేవుడి అనుగ్రహం, ఆశీర్వాదం లభిస్తాయనీ తెలుసు. తరచు ప్రార్థన విలువ గురించి చదువుతూంటారు, వింటూంటారు.

ఎవరైనా వారిని 'మీరు ఎందుకు ప్రార్థన చేయడం లేదు?' అని అడిగితే వారి దగ్గర సరైన జవాబు ఉండదు.

సూర్యుడు ఉన్నప్పుడు ప్రార్థించని వాడికి మబ్బులు వచ్చి చీకట్లు కమ్మాక అప్పుడు ప్రార్థించడం ఇంకా కష్టమవుతుంది. కనీసం మనమైనా ఆ ఊళ్ళోని బూట్లు తొడుక్కోని ప్రజల్లా కాక, దైవ ప్రార్థన చేసే ఆస్తికులుగా జీవిద్దాం.

## 54. వ్యామోహం

ఓ రోజు ఓ మనిషి ఓ అడవికి వేటకి వెళ్ళాడు. అకస్మాత్తుగా రెండు ఏనుగులు అతని వెంట పడ్డాయి. వాటినించి పారిపోవడానికి అతను ఓ పెద్ద చెట్టుని ఎక్కి దాని కొమ్మల్లో దాక్కున్నాడు. కాని ఏనుగులు అతన్ని పసికట్టి, తమ తొండాలని చెట్టు బోదె చుట్టూ పోనిచ్చి దాన్ని గట్టిగా వూపసాగాయి.

ఆ మనిషి కూర్చున్న చెట్టు పై కొమ్మ మీద ఓ పెద్ద తేనెపట్టు నించి ఆ తాకిడికి తేనె కారసాగింది. ఆ మనిషి ఆనందంగా తేనెని తాగసాగాడు. ఇంతలో తేనెటీగలు అతన్ని చుట్టు ముట్టి కుట్టసాగాయి. ఆ సమయంలో అటుగా ఓ దేవత రథం మీద వెళ్తూ ఆ మనిషి దుస్థితిని చూసి జాలి పడి ఆగింది.

"మిత్రమా! నువ్వు గొప్ప కష్టంలో వున్నావు. వెంటనే నా రథం ఎక్కు. నిన్ను రక్షిస్తాను." దయగా చెప్పిందా దేవత.

"ఒక్క క్షణం ఆగండి. తేనె ఐపోవస్తోంది. తర్వాత వస్తాను."

ఆ దేవత దయతో అతని కోసం కొద్ది సేపు ఆగి, అతను తేనెని తాగాక మళ్ళీ చెప్పింది.

" ఇక రా."

"తేనె ధార ఇంకా ఆగలేదు. దయచేసి మరి కొద్ది క్షణాలు ఆగండి." చెప్పాడు ఆ మనిషి.

"ఓ పక్క నిన్ను తేనెటీగలు కుడుతున్నాయి. ఇంకో పక్క ఏ క్షణంలోనైనా ఏనుగులు తమ తొండాలతో నువ్వు ఎక్కిన చెట్టుని కూల్చేసి నిన్ను కాళ్ళతో తొక్కి చంపగలవు. ఐనా ఆ తేనె మీద వ్యామోహాన్ని వదులుకోలేవా? ఆఖరిసారి పిలుస్తున్నాను. రా. లేదా నేను వెళ్ళిపోతాను." ఆశ్చర్యంగా చూస్తూ హెచ్చరించిందా దేవత.

"ఆగు. ఇంక కాస్తే మిగిలింది. ఒక్క నిముషం ఆగు చాలు."

ఆ దేవత మరి కొద్ది నిముషాల సేపు వేచి వుండి, అతన్ని అనేకసార్లు పిలిచినా తేనె రుచి మరిగిన ఆ మనిషి ఆ దేవత రథంలోకి ఎక్కలేదు. విసుగేసి దేవత వెళ్ళిపోయింది.

* * *

ఇది మనందరి కథే. తాత్కాలిక ఆనందాన్ని ఇచ్చే ప్రాపంచిక సుఖాలని వదిలి, శాశ్వతమైన బ్రహ్మానందాన్ని పొందమని మనకి చెప్పే దేవతే సద్గురువు. మనం ప్రాపంచిక సుఖాల కోసం ఆర్జించే ధనమే తేనెధార. మనం మనదిగా భ్రమించే తల్లి, తండ్రులు; భార్యా, పిల్లలు; బంధు మిత్రులు తేనె చుక్కలు. ఫలితంగా మనల్ని చుట్టుముట్టే కష్టాలే తేనెటీగలు. పొంచి వున్న మృత్యువే ఏనుగులు. సద్గురువు మాట వింటే వీటన్నిటి నించి తప్పించుకుని బ్రహ్మానందాన్ని శాశ్వతంగా పొందచ్చు.

## 55. బలహీనుడు

ఓ గ్రామంలో ఓ బలవంతుడైన ఇనప పనివాడు ఉండేవాడు. అతను ఎవరు చేసిన ఎలాంటి ఇనుప గొలుసునైనా పరీక్షించి, అందులోని బలహీనమైన కొక్కేన్ని తేలిగ్గా గుర్తించి దాన్ని తెంపగల బలవంతుడు. పండగలకి ఓ పెద్ద గొలుసుని తెచ్చి దాంతో అతన్ని కడితే, అందులోని అతి బలహీనమైన గొలుసుని తేలిగ్గా కనిపెట్టి, దాన్ని తెంపేసి, చూపరులకి వినోదాన్ని అందించ గలిగేవాడు.

ఓసారి అతను ఓ చట్ట వ్యతిరేకమైన పని చేయడం వల్ల రాజ భటులకి దొరికిపోయాడు. వారు అతన్ని ఓ ఇనప గొలుసుతో బంధించారు. అతను వాళ్ళ